క్లుప్తంగా

గాంధీ విగ్రహానికి చేతిని అతికించారు



రాజానగరం గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న మహాత్ముని విగ్రహం

రాజానగరం: స్థానిక గ్రామ కూడలిలో ఉన్న గాంధీ మహాత్ముని విగ్రహానికి ఉన్న కుడి చేతిని ఆకతాయిలు ఎవరో విరిచారు. గాంధీ బొమ్మ సెంటరుగా పిలిచే ఈ ప్రాంతంలో ఇది జరగడం స్థానికంగా విమర్శలకు తావిచ్చింది. దివాన్‌చెరువుకు చెందిన సామాజిక కార్యకర్త డేవిడ్‌రాజు సోషల్ మీడియాలో ఈ విషయమై పలుమార్లు ఫొటోలు పోస్టు చేయడంతో సమస్య వైరల్ అయింది. దీనితో స్థానిక ఆర్య వైశ్య సంఘీయులు స్పందించారు. ఆదివారం శిల్పిని పిలిచి, గాంధీ మహాత్ముని విగ్రహానికి జరిగిన డామేజీని సరి చేయించారు.

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్య దేవుని దర్శనానికి ఆదివారం భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలోస్వామి వారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసింది.

యేసయ్య పట్ల విశ్వాసంతో నిత్యదీవెనల ప్రాప్తి

రెవరెండ్ ఫాదర్ మనోజ్‌కుమార్



వాక్యసందేశాన్నిస్తున్న రెవరెండ్ ఫాదర్ మనోజ్‌కుమార్

కోరుకొండ: క్రైస్తవుల ఆరాధ్య దైవమైన యేసు క్రీస్తు పట్ల విశ్వాసాన్నుంచుకుంటే నిత్యదీవెనలందుకోవచ్చని ఆర్‌సీఎం రెవరెండ్ ఫాదర్ బి.మనోజ్‌కుమార్ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడిగ్రామంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా వాక్యసందేశంలో ఆయన మాట్లాడుతూ కరుణామయుడైన యేసు క్రీస్తు ప్రజలను క్షమిస్తూ, ఆశీర్వాదాలను అందిస్తారన్నారు. అయితే ఆయనపట్ల విశ్వాసాన్ని పెంచుకోవాలన్నారు. నిత్యం బైబిల్ పఠనం ద్వారా విజ్ఞానాన్నిపెంపొందించుకోవచ్చన్నారు. మిషనరీకి చెందిన మఠకన్యలు ఉదయం నుంచి బూరుగుపూడిలోని ఆర్‌సీఎంకు చెందిన క్రైస్తవుల ఇంటింటికీ వెళ్లి, యోగక్షేమాలను తెల్సుకొని, ప్రార్థనలు చేశారు. సేవలందజేసిన మఠకన్యలకు స్థానిక సంఘస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రార్థనలో స్థానిక ఉపదేశి కొల్లి జాకబ్, సంఘపెద్దలు గెడ్డం రత్నం, కాతేటి జార్జి, చుక్కా శ్యామల, పెనుమాకుల నిర్మల, కందుకూరి పండు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

రాజానగరం: సమాజంలో ఆర్యవైశ్యులు తమ సామాజిక వర్గం వారి అభివృద్ధితోపాటు ఇతర సామాజిక వర్గాల అభ్యున్నతికి సేవలందించడం హర్షణీయమని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మెడికాన్ దివాన్‌చెరువులోని ఎస్వీపీసీ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగింది. క్లబ్ ప్రెసిడెంట్ వై. రామకృష్ణ సేవే పరమావధిగా తమ క్లబ్ ద్వారా పనిచేస్తున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, తదితర రాష్ట్రాలతోపాటు 25 దేశాలలో తమ క్లబ్ విస్తరించి ఉందన్నారు. 2013లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ద్వారా ఉత్తమ అవార్డును అందుకున్నామన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

గ్రామీణ అభివృద్ధి లక్ష్యం

రాజమహేంద్రవరం సిటీ: రైతుల అమూల్య సేవలను గౌరవించడమే కాక, జాతీయ బ్యాంకులు వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి లక్ష్యంగా చేసుకున్నాయని బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్లు ఎం.సుభాకర్, నికేష్‌కుమార్‌సిన్హా పేర్కొన్నారు. ఆదివారం బ్యాంక్‌ల జాతీయకరణ దినోత్సవం సందర్భంగా సీతంపేట కార్యాలయంలో కిసాన్ దివస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేద, వెనుకబడిన ప్రాంతాలలో బ్యాంకింగ్ సేవలను విస్తరించే దిశగా కట్టుబడి పని చేస్తోందన్నారు.

కొల్లగట్టు.. కాసులు పట్టు

- యథేచ్ఛగా మట్టి అక్రమ తరలింపు
- కాలువ గట్లనూ తవ్వేస్తున్న వైనం
- అక్రమార్కులకు కాసుల పంట
- నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధి సపోర్టు



రెవెన్యూ అధికారులకు స్థానికులు అప్పగించిన మట్టి లారీలు

రాజానగరం: జిల్లాలో రాజానగరం నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. ఈ పేరు వినగానే టక్కున గుర్తుకు వచ్చేది గోదావరి ఇసుక. దీనితోనే పాలకులు కోట్లాది రూపాయలు గడిస్తున్నారనేది జగమెరిగిన సత్యం. ఇప్పుడు దీనికి మట్టి కూడా తోడైంది. ఇక తెలియంది ఏముంది, మట్టి తవ్వకాలతో నియోజకవర్గంలో కొండలు సైతం కరిగిపోతున్నాయి. ఏడాది కాలంగా సాగుతున్న ఈ అక్రమ దందా చెరువు, కాలువ గట్లకు కూడా విస్తరించింది. మట్టి గుట్ట కనిపిస్తే చాలు రాత్రికి రాత్రే మాయమైపోతుంది. ఈ క్రమంలో మట్టి మాఫియా కన్ను పోలవరం కాలువ గట్లపై కూడా పడింది.

అక్రమ దందా

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పోలవరం ప్రాజెక్టులో భాగంగా కాలువను తవ్వి, దానికి ఇరువైపులా కొండల్లా మట్టి గుట్టలు పెట్టారు. రాబోయే కాలంలో కాలువ వెంబడి, రహదార్లను అభివృద్ధి చేయవచ్చనే ఆలోచనో ఏమోగానీ దశాబ్ద కాలంగా ఆ కాలువ గట్ల జోలికి ఎవ్వరూ వెళ్లలేదు. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల ద్వారా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారులో స్థానిక పాలకులు అక్రమ దందాకు తెరలేపారు. గోదావరి ఇసుకతో దందాను ప్రారంభించిన వారు క్రమేపీ కొండలను తొలి చేసి, చెరువులను తోడేసి, చివరకు పోలవరం కాలువ గట్లను కూడా వదలకుండా తవ్వేస్తున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా భారీ వాహనాల్లో తరలి పోతున్న మట్టి రవాణాతో రోడ్లు పాడై, ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వారికేమి పట్టనట్టుగా ఉంటున్నారు. విసిగిపోయిన ప్రజలు ఆ లారీలను అడ్డుకుని, అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆపిన వాహనాలు గంటల్లో ఆయా ప్రాంతాల నుంచి మాయమై, యథాతథంగా అక్రమ రవాణాను కొనసాగించడం విశేషం.

తెల్లవారాక చూస్తే మాయం

అర్ధరాత్రి పట్టుకుని, అధికారులకు అప్పగించిన మట్టి లారీలు.. తెల్లవారాక చూస్తే కనిపించలేదు. ఎక్కడి దొంగలు అక్కడ గప్ చిప్ అన్నట్టుగా మాయమైపోయాయి. మండలంలోని కలవచర్ల వద్ద ఉన్న పోలవరం కాలువ గట్ల నుంచి మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్న ఎనిమిది లారీలను గురువారం రాత్రి స్థానిక యువకులు కొందరు అడ్డుకుని, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటామని కూడా అధికారులు చెప్పారు. ఇంతలోనే పైఅధికారుల నుంచి వర్తమానాలు రావడంతో వాటిని వదిలేశారు. అదేమని ప్రశ్నిస్తే వాటికి అనుమతులున్నాయంటూ సమాధానమిచ్చారు.

నిర్ణీత సమయం లేకుండా అనుమతులు

పోలవరం ప్రధాన కాలువ గట్టును తవ్వి, మట్టిని రవాణా చేసేందుకు కొందరు వ్యక్తులకు ఆ కాలువకు సంబంధించిన ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చారు. అయితే ఈ అనుమతులు ఎప్పుడు ఇచ్చారు. ఎప్పటి వరకు, ఏ మేరకు మట్టిని తీసుకువెళ్లవచ్చు అనే ప్రధాన విషయాలు లేవు. ఆ అనుమతులను చూపించి, సంబంధిత వ్యక్తులు రెవెన్యూ అధికారులకు అప్పగించిన మట్టితో కూడిన లారీలను తీసుకుపోయారు. 9500 క్యూబిక్ మీటర్ల మట్టిని తీసుకువెళ్లేందుకు అనుమతి ఉందిగానీ దానికి నిర్ణీత సమయం అంటూ ఆ అనుమతుల్లో లేకపోవడంతో లారీలను ఆపిన ప్రతిసారీ వాటిని ఫ్రెష్‌గా చూపించి, అక్రమార్కులు తమ దందాను కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిజానికి ఇదే అనుమతులను పరిగణనలోకి తీసుకుంటే 1,580 లారీలతో అనుమతులు అయిపోతాయి. కానీ నెలల తరబడి తరలింపు జరుగుతూనే ఉంది. అంతేకాదు ఈ అక్రమ దందాలో అధికారుల నుంచి అనుమతులు తీసుకునే ప్రాంతం ఒకటి, తవ్వే ప్రాంతం మరొకటిగా ఉంటుంది. సమస్యలొస్తే అనుమతులు పొందిన ప్రాంతాన్ని చూపిస్తున్నారు, లేకుంటే వారికి అనుకూలంగా ఉన్న ప్రాంతం నుంచి యథేచ్ఛగా రవాణా జరిగిపోతోంది.

నియోజకవర్గ ప్రతినిధి కీలకం

ఇసుక, మట్టి అక్రమ దందాలో నియోజకవర్గ ప్రతినిధిగా ఉన్న వ్యక్తిదే ప్రధాన పాత్ర. ఆయనకు తెలియకుండా ఒక్క లారీ కూడా బయటకు వెళ్లదు. ఆయన చెప్పే మాటలకు, చేసే పనులకు అస్సలు సంబంధమే ఉండదనడానికి ఇక్కడ జరుగుతున్న ఇసుక, మట్టి అక్రమ రవాణాయే నిదర్శనం. రాజానగరంలో తెల్లవారే సరికే స్థానికులు పట్టిచ్చిన మట్టి లారీలు మయామయ్యాయంటే ఈ అక్రమ దందా ఎలా జరుగుతోందో గమనించవచ్చు.

– గంగిశెట్టి సోమేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, పాలచర్ల

నేడు బిక్కవోలులో పీజీఆర్ఎస్‌కు కలెక్టర్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): బిక్కవోలు మండలంలో సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యాక్రమానికి కలెక్టర్ ప్రశాంతి హాజరవుతున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌కి జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారన్నారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి సంబరం



జి.మామిడాడలో సత్తెమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో సత్తెమ్మ తల్లి సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు చేశారు. సంబరం సందర్భంగా ఆలయం వద్ద గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు అమ్మవారిని దర్శించుకుని సంబరంలో పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టు ముమ్మాటికి రాజకీయ కుట్రే

- లేని లిక్కర్ స్కామ్‌లో వైఎస్సార్ సీపీ నాయకులను ఇరికిస్తున్నారు
- పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి



అనపర్తి : కూటమి పెద్దలు సృష్టించిన లిక్కర్ స్కామ్ కేసులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెదిరెడ్డి మిథున్‌రెడ్డిని ఇరికించి అరెస్టు చేయడం ముమ్మాటికి రాజకీయ కుట్రేనని వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధికార ప్రతినిధి, ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల మనసులో గూడు కట్టుకున్న వైఎస్ జగన్‌మోహనరెడ్డిని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏవిధంగా వారి మనుసుల్లో నుంచి దూరం చేయాలి అనే దురాలోచనలో భాగంగా అక్రమ అరెస్టులు చేస్తున్నారని అన్నారు. ప్రజలను వైఎస్సార్ సీపీ శ్రేణులను భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలు, అక్రమ అరెస్టులు పెచ్చుమీరాయన్నారు. దానిలో భాగంగానే లేని లిక్కర్ స్కామ్‌లో పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారన్నారు. తమ నాయకుడిని ఇబ్బంది పెట్టినవారు అంతకంతా మూల్యం చెల్లించుకుంటారని ఆయన హెచ్చరించారు. చంద్రబాబు పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయించాడన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, రాజకీయంగా ఎంత ఇబ్బంది పెట్టినా తమ నాయకుడు మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

సొంత సంపద సృష్టిస్తున్న ప్రజా ప్రతినిధి

- గ్రావెల్, పేకాట క్లబ్బులు, నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం ఏదీ కాదనర్హం
- అనపర్తి నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆరోపణ



అనపర్తి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అనపర్తిలో ప్రజాప్రతినిధి తన ఖజానా నింపుకోవడానికి, సొంత సంపద సృష్టించుకోవడానికి గ్రావెల్, మట్టి, పేకాట క్లబ్బులు, నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం ఇలా ఏది అనర్హం కాదని అనపర్తి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో రాజధాని, పోలవరం, అభివృద్ధి పేరుతో ఏమీ చేయకపోయినా ఎంతో చేసినట్టు ప్రజలను భ్రమింప చేసి రాష్ట్రస్థాయి నాయకులు వారి స్థాయిలో వారు స్వంత సంపద సృష్టించుకుంటుంటే వారి బాటలోనే నియోజకవర్గాల్లో కూటమి ఎమ్మెల్యేలు కూడా ఎవరి సంపద వారు సృష్టించుకుంటున్నారని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. జీవో 203లోని లోసుగులను అసరాగా చేసుకుని అధికార పార్టీ ఎమ్మెల్యేలు అప్రతిహతంగా అక్రమ మట్టి దందా సాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. అనపర్తి నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను కట్టడి చేయవలసిన ఉద్యోగులపై ఒత్తిడి చేసి, జిల్లాలు దాటించి మరీ ఈ అక్రమ వ్యవహారాన్ని కొనసాగిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని చెరువుల్లో మట్టి రాత్రి, పగలు తేడా లేకుండా బారీ టిప్పర్‌ల ద్వారా పక్క జిల్లాలకు తరలిపోతుంటే మైనర్ ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ప్రకృతి వనరుల దోపిడీ పై ఆయా శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దోపిడీదారుల ఒత్తిళ్ళకు జిల్లాస్థాయి అధికారులే చేతులెత్తేస్తు ఇది మా పరిధి కాదు అంటూ సాకులు చెబుతున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అయితే ఇటువంటి అక్రమ వ్యవహారాలపై గ్రామస్థాయిలోనే అధికారులు కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసేవారన్నారు. నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుడి బంధువులు, ముఖ్య అనుచరులు నిర్వహిస్తున్న కొన్ని బ్రాందీషాపుల్లో గుట్టు చప్పుడు కాకుండా నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని విక్రయిస్తున్నారని అన్నారు. బిక్కవోలు మండలంలోని ఒక గ్రామ ప్రధాన కూడలిలో నియోజకవర్గ అధినేత దగ్గర బంధువు నిర్వహిస్తున్న బ్రాందీ షాపులో జులై 19 రాత్రి అబ్కారీశాఖాధికారులు నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారని, అధినేత ఒత్తిడితో గుట్టుచప్పుడు కాకుండా తిరిగి ఇచ్చేశారని ఆయన ఆరోపించారు. నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహిస్తున్న భారీ పేకాట క్లబ్‌లను పక్కదారి పట్టించడానికి చిన్న వాళ్లపై పేకాట కేసులు నమోదు చేసి పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. ఈ క్లబ్‌ల పై వచ్చే ఆదాయాన్ని లెక్కించడానికి కౌంటింగ్ మెషీన్లు వాడుతున్నట్టు కూటమి నాయకులే గుసగుసలాడుకుంటున్నారని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు.

108 వంటకాలతో వెదుళ్లమ్మకు సారె



చినకొండేపూడిలో సారెను ఊరేగిస్తున్న భక్తులు



చినకొండేపూడి శ్రీవెదుళ్లమ్మ తల్లి అమ్మవారి సారె ఊరేగింపులో కోలాట నృత్యం

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి గ్రామ దేవత శ్రీవెదుళ్లమ్మ తల్లి అమ్మవారికి ఆషాఢమాసంలో 108 వంటకాలతో సారె అందించారు. ఆదివారం చినకొండేపూడిలోని అమ్మవారికి అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినకొండేపూడి, శ్రీరామదుర్గ కాలనీకి చెందినమహిళలు అమ్మవారికి నూతన చీరలు, రవికుల గుడ్డలు, 108 రకాల వంటలను బిందెలలో ఉంచి, గరగ నృత్యాలు, కోలాటం, తీన్‌మార్ డప్పు వాయిద్యాలతో అత్యంత వైభవంగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సారె గల బిందెలతో మహిళలు శ్రీవెదుళ్లమ్మ తల్లి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని, అమ్మవారికి 108 రకాల వంటల సారెను సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



శ్రీవెదుళ్లమ్మ తల్లి

బాల్యం నుంచీ ఆధ్యాత్మిక చింతన ఉండాలి



బాల వికాస్ తరగతులలో పాల్గొన్న విద్యార్థులు

రంగంపేట: విద్యార్థులు బాల్యం నుంచీ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, దీనికి బాల వికాస్ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని బాల వికాస్ గురువులు పప్పు దేవి, తిమ్మలపూడి హైమావతి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పాత వీరంపాలెం గ్రామంలో కోదండ రామాలయంలో నిర్వహించిన సత్యసాయి బాల వికాస్ తరగతులలో వారు మాట్లాడారు. నిద్ర లేచింది మొదలు నిద్ర పోయేవరకు చేయాల్సిన ప్రార్థనలు, పద్య సూక్తులు, కథలు, భజన పాటల గురించి వివరించారు. భజన మండలి కన్వీనర్ నాగులపల్లి సూర్య భాస్కరరావు, బాల వికాస్ గురువు తెల్లాకుల చక్రధర్, సేవాదళ్ సభ్యులు నాగులపల్లి సహదేవుడు, సత్యవాణి, బాల వికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కక్ష పూరితంగా ఫ్లెక్సీల చింపివేత

మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిన్న

సీటీఆర్ఐ: ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్.జవహర్ ఫ్లెక్సీలను చింపివేసిన వారిపై చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనకుదిగుతామని మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపకుడు ఆకుమర్తి చిన్న హెచ్చరించారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొవ్వూరు మండలం పశివేదలలో ఈ నెల 20వ తేదీన రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ఫ్లెక్సీలను కూటమి నాయకుడైన పెండ్యాల అచ్యుతరామయ్య చౌదరి వర్గం వారు చింపేవేయడం దారుణమన్నారు. దళిత వర్గానికి చెందిన ఒకరికి పదవి వస్తే ఈవిధంగా చేయడం దారుణమన్నారు. పోలీసులకు సమాచారం అందించినప్పటికీ నిమ్మకి నీరెత్తినట్లు ఉండటం భావ్యం కాదన్నారు. దళితుల మధ్య గ్రూప్‌లను ఏర్పాటు చేసి వారిని రెచ్చగొట్టే విధంగా చేస్తున్న అచ్యుతరామయ్య చౌదరిపై చర్యలు తీసుకోకపోతే ఈ నెల 24వ తేదీన ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

సీహెచ్‌సీ స్టాఫ్‌నర్స్‌కు సత్కారం



సత్కారాన్ని అందుకున్న స్టాఫ్‌నర్సు లలితకుమారి

కోరుకొండ: మండలంలోని దోసకాయలపల్లి పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్స్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న చిల్లా లలితకుమారిని ఆదివారం యంగ్‌మైండ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ ఘనంగా సత్కరించింది. మహమ్మారి కోవిడ్ సందర్భంలో వైద్యసేవలందజేసినందుకుగాను ఈ సత్కారం జరిగింది. కాకినాడలో జరిగిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు చేతులమీదుగా సత్కరించారు. యంగ్ మైండ్స్ వ్యవస్థాపకులు వెంకటరమణ మాట్లాడుతూ కరోనా సందర్భంలో వైద్యులు, నర్సులు సేవలందజేయడంతో ప్రజలు ప్రాణాలతో ఉన్నారన్నారు. అలాంటి సేవలందించిన వారిని సత్కరిస్తున్నట్టు తెలిపారు.

అడుగడుగునా గోతులే...



కాతేరు చెరువు వద్ద రోడ్డుపైన గొయ్యి



ఎన్టీఆర్ బస్టాండ్ వద్ద గోతులు



గామన్ బ్రిడ్జి వద్ద ఇలా..

కాతేరు గ్రామంలో ఆర్‌అండ్‌బీ రహదారిపై అడుగుడుగునా గోతులు దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్డులో ఆర్టీసీ బస్సులు, స్కూలు బస్సులు, వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఈ రోడ్డుపై గోతుల వల్ల వాహన చోదకులు రాత్రి సమయంలో కిందపడి గాయాల పాలవుతున్నారు. అయినా ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం రోడ్లపై గోతులను పూడ్చి సంక్రాంతి పండగను తెస్తామంటూ ప్రకటనలకే పరిమితమైంది తప్ప ఆచరణలో విఫలమైందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గోతులను పూడ్చాలని కోరుతున్నారు.

– రాజమహేంద్రవరం రూరల్

జంతు సంరక్షకులకు చట్టాలపై అవగాహన

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రంలో జంతు సంరక్షకులకు యానిమల్ రెస్క్యూ అర్గనైజేషన్, హ్యూమన్ వరల్డ్ ఫర్ ఎనిమల్స్ ఇండియా ఫౌండేషన్, శ్రీ సుమతి నాథాజీ జీవదయ ట్రస్ట్‌ల సహకారంతో జంతు సంరక్షణ చట్టాలపై ఆదివారం స్థానిక టి.నగర్‌లోని పర్ణశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జంతువులను కాపాడే లక్ష్యంతో ఏ విధంగా జంతు ప్రేమికులు పని చేయాలో పలువురు వక్తలు దిశానిర్దేశం చేశారు. జంతువులపై జరుగుతున్న అమానవీయ ఘటనలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ చర్చలలో భాగంగా పశువుల సంతలలో జరుగుతున్న చట్ట ఉల్లంఘనలు, వీధి కుక్కల జనన నియంత్రణ కార్యక్రమంలో జరుగుతున్న అవకతవకలు, వీధి కుక్కలకు ఆహారం అందించే వారికి కలుగుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాల గురించి నిపుణులు పలు చట్టాలపై జంతు సంరక్షకులకు అవగాహన కల్పించారు. యానిమల్ రెస్క్యూ అర్గనైజేషన్, హ్యూమన్ వరల్డ్ ఫర్ ఎనిమల్స్ ఇండియా ఫౌండేషన్, శ్రీ సుమతి నాథాజీ జీవదయ ట్రస్ట్‌ల ప్రతినిధులు గోపాల్, తేజోవంత్, ధర్మేంద్ర, రచనాజైన్, పలు జిల్లాల నుంచి జంతుప్రేమికులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఇంటర్నేషనల్ చెస్ డే

రాజమహేంద్రవరం సిటీ: చదరంగంలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు కాల్‌ఫ్యూజన్ చెస్ అకాడమీ డైరెక్టర్ విత్తనాల కుమార్ తెలిపారు ఆదివారం దానవాయిపేట అకాడమీలో రాజమండ్రి లైన్స్ క్లబ్ సహకారంతో అంతర్జాతీయ చదరంగం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్విటేషన్ చదరంగం టోర్నమెంట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సుమారు 150 మంది పిల్లలతో ఈ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అంతజేసినట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో రోషిత నాయుడు (మొదటిబహుమతి), డి.రుతిక్ (రెండో బహుమతి), వాకలపూడి లతిక (మూడో బహుమతి) గెలుచుకున్నారన్నారు.